గ్రూప్-1 పరీక్షల్లో అవకతవకలు..

దేశ విద్యావ్యవస్థలోనే అతిపెద్ద స్కామ్

విశ్వంభర, కరీంనగర్: ఇటీవల టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 పరీక్షల్లో భారీగా అవకతవకలు జరిగాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆరోపించారు. ఇది దేశ విద్యావ్యవస్థలోనే అతిపెద్ద స్కామ్ అని అన్నారు. మొత్తం 21,093 మంది గ్రూప్-1 పరీక్షలు రాస్తే 21,103 మంది ఫలితాలు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. పది మంది అదనంగా ఎక్కడి నుంచి వచ్చారని నిలదీశారు. కరీంనగర్‌లో మరో ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌తో కలిసి నిర్వహించిన ప్రెస్‌మీట్ పాడి మాట్లాడారు.ఉర్దూ మీడియంలో 9 మంది పరీక్ష రాశారని ఒకసారి, 10 రాశారని మరోసారి టీజీపీఎస్సీ రిపోర్ట్ ఇచ్చిందని, ఇందులో ఏది నిజం, ఏది అబద్ధమని కౌశిక్ రెడ్డి ప్రశ్నించారు. ప్రిలిమ్స్‌కు ఒక హాల్ టికెట్, మెయిన్స్‌కు మరో హాల్ టికట్ ఇచ్చిన సందర్భం దేశ చరిత్రలో లేదని మండిపడ్డారు. ఈ అంశం టీజీపీఎస్సీ చేతిలో ఉంటుందని సమర్థించుకుంటున్నారని, అక్కడే స్కామ్‌కు ఆస్కారం ఏర్పడిందని విమర్శించారు.ఒకే పరీక్షా కేంద్రంలో పరీక్ష రాసిన 654 మందికి సేమ్ మార్కులు ఎలా వచ్చాయని పాడి ప్రశ్నించారు. కోఠిలోని ఓ సెంటర్లో పరీక్షలు రాసిన 1,497 మందిలో 75 మంది ఉద్యోగాలకు సెలెక్ట్ అయ్యారని, మిగతా 25 సెంటర్లలో 10,135 మంది పరీక్షలు రాస్తే కేవలం 65 మందే సెలెక్ట్ అయ్యారని ఇదెలా సంభవమని నిలదీశారు. ఉర్దూలో పరీక్షలు రాసిన 9 మందిలో ఏడుగురికి ఉద్యోగాలు ఎలా వచ్చాయని అడిగారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ రాములు నాయక్ కోడలుకు మల్టీజోన్‌లో నంబర్ 1 ర్యాంకు, స్టేట్ లో 206వ ర్యాంకు వచ్చిందని అన్నారు.పరీక్ష రాసిన వారికంటే అదనంగా వచ్చిన 10 మందిలో రాములు నాయక్ కోడలు ఉన్నదని కౌశిక్‌రెడ్డి ఆరోపించారు. బీజేపీ నాయకులు ఈ విషయమై ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. సీఎం రేవంత్ రెడ్డి నుంచి పెద్ద ఎత్తున ముడుపులు ముడుతున్నాయని, అందుకే బీజేపీ నోరు మెదపడం లేదని ఆరోపణ చేశారు. బీఆర్ఎస్ హయాంలో చిన్నచిన్న పరీక్షల పేపర్లు లీకైనాయని ఎగిరెగిరి దుంకిన కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్.. ఇపుడు ఇంత పెద్ద స్కామ్ జరిగినా ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.సీఎం నుంచి ఆయనకు ముడుపులు ముడుతున్నాయని పాడి ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీ రెండూ ఒకటేని విమర్శించారు. గ్రూప్-1 అవకతవకలపై కేంద్ర ప్రభుత్వం వెంటనే సీబీఐ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 పరీక్షల్లో అవకతవకలు జరిగినట్లు ఆధారాతో సహా బయటపెట్టామని చెప్పారు. దీనిపై విచారణ జరిపించి కాంగ్రెస్ నాయకులు తమ నిజాయితీని నిరూపించంకోవాలని డిమాండ్ చేశారు.

కంచ గచ్చిబౌలిపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు : హరీశ్‌రావు



సుప్రీంకోర్టు తీర్పును మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు స్వాగతించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన, చేయబోతున్న పర్యావరణ విధ్వంసం ఎంత భయంకరమైందో సుప్రీం కోర్టులో జరిగిన వాదనల వల్ల ప్రపంచానికి తేటతెల్లమైంది అని హరీశ్‌రావు పేర్కొన్నారు. బాధ్యత గల ప్రభుత్వం, కావాలనే సెలవు దినాల్లో బుల్‌డోజర్లతో విధ్వంసానికి పాల్పడటంపై సుప్రీం కోర్టు చేసిన వ్యాఖ్యలు ఈ ప్రభుత్వానికి చెంపపెట్టు. విధ్వంసం చేసిన వంద ఎకరాలను ఎలా పునరుద్ధరిస్తారో చెప్పాలని నిలదీయడం ఆహ్వానించదగ్గ పరిణామం. కంచె గచ్చిబౌలి భూములను, పర్యావరణాన్ని కబళించాలని చూసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ తన రిపోర్టుతో కళ్లు తెరిపించింది అని హరీశ్‌రావు తెలిపారు.అధికారం ఉంది కదా అని ఇష్టారీతిగా వ్యవహరిస్తే సభ్య సమాజం, న్యాయ వ్యవస్థ చూస్తూ ఊరుకోవని.. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి ముందుకు వస్తాయని గతంలోనూ అనేక సార్లు నిరూపనైంది. ఈరోజు కూడా అదే జరిగింది. విధ్వంసమే విధానంగా సాగుతున్నది రేవంత్ రెడ్డి నిరంకుశ పాలన.. నాడు హైడ్రా పేరుతో ఇండ్లు కూల్చి అరాచకం. నేడు బుల్‌డోజర్లతో పర్యావరణ హననం. మాకు న్యాయస్థానాల మీద ఎంతో గౌరవం ఉంది. అందుకే బాధ్యతగా బిఆర్ఎస్ పార్టీ తరుపున సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీకి నివేదిక ఇచ్చాం. ఆధారాలతో సహా వాస్తవాలు వివరించాం. వృక్షో రక్షతి రక్షిత అని పెద్దలంటే, వృక్షో భక్షతి అన్నట్లుగా తయారైన రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పేందుకు రాష్ట్ర ప్రజలందరూ ఏకం కావాలి అని హరీశ్‌రావు పిలుపునిచ్చారు.

అన్ని ప్రాంతాలకు నన్నే రమ్మంటున్నారు..

విశ్వంభర, వరంగల్: ఎన్నికలు ఎప్పుడు వచ్చినా విజయం మనదేనని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఓ సమావేశంలో మాట్లాడుతూ.. కార్యకర్తలకు ధైర్యం చెప్పేందుకే తాను గ్రామాల్లో తిరుగుతున్నానని అన్నారు. ఇప్పుడు అన్ని ప్రాంతాలకు తననే రమ్మంటున్నారని చెప్పారు. వర్ధన్నపేటకు రమ్మంటున్నారని, వరంగల్ కు రమ్మంటున్నారని అన్నారు. కానీ తాను పాలకుర్తిలోనే మళ్లీ నిలబడతానని వాళ్ల సంగతి ఏంటో చూస్తానని చెప్పారు. దయచేసి కార్యకర్తలు ఎవరూ అధైర్యపడవద్దని అన్నారు. నాయకులు విజృంభించాలని, అందరూ కలిసిమెలిసి ఉండాలని సూచించారు.ఇప్పటి నుండి చాలా బిజీ పనులు ఉంటాయని పార్టీ సభ్యత్వాలు, మండల కమిటీల ఎంపిక, గ్రామ కమిటీల ఎంపికలు ఉంటాయని చెప్పారు. ఇవన్నీ పెద్దఎత్తున ఉంటాయన్నారు. తాను ఎవరికీ టార్గెట్ లు ఇవ్వనని నాయకులే టార్గెట్ పెట్టుకుని పనిచేయాలన్నారు. ఎంత మందిని తీసుకురావాలో కూడా తాను చెప్పనని గ్రామాల్లో మీ అనుకూలతను బట్టి జనాలను తీసుకురావాలని కార్యకర్తలకు సూచించారు. ఇదిలా ఉంటే పాలకుర్తిలో మాజీ మంత్రి ఎర్రబెల్లి వర్సెస్ ప్రస్తుత ఎమ్మెల్యే యశస్వి రెడ్డి ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారు. మరోవైపు ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిస్తే తాను రాజకీయాల నుండి పూర్తిగా తప్పుకుంటానని సైతం ఎర్రబెల్లి సవాల్ చేశారు.

పాలనలో ఫెయిల్.. సీఎంపై మాజీ ఎమ్మెల్సీ ఫైర్

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలనలో విఫలమవుతోందని, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా విశ్వాసం కోల్పోయిన దుస్థితి ఏర్పడిందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ విమర్శించారు. సీఎల్పీ సమావేశంలో ముఖ్యమంత్రి స్వయంగా చేసిన వ్యాఖ్యల ద్వారా ఆయన నిరాశ, నిస్పృహ స్పష్టంగా ప్రతిఫలించిందని తెలిపారు.బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కేబినెట్‌లో సమిష్టి బాధ్యత లేకుండా ఒక్కో మంత్రి ఒక్కో మాట మాట్లాడడం, సీఎం తన అధికార పరిధిలోని నిర్ణయాలను అధిష్టానంపై నెట్టేసే తీరు, ఈ ప్రభుత్వం గందరగోళంలో ఉన్నదన్న భావనకు బలం చేకూర్చుతోందన్నారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి దివాళా స్థితికి చేరుకోవడమే కాదు, శాంతిభద్రతలు, సంక్షేమం, పరిపాలన అన్నీ తీవ్రంగా దెబ్బతిన్నాయనడానికి ప్రస్తుత తాజా రాజకీయ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయని పేర్కొన్నారు.కేబినెట్ సమిష్టి బాధ్యత తో పనిచేయాల్సిన వ్యవస్థ. కానీ ప్రస్తుతం ప్రభుత్వంలో ఆ సమిష్టి బాధ్యత అనేది కనిపించడం లేదని హెచ్‌సీయూకు సంబంధించిన వ్యవహారంలో ఇది స్పష్టంగా కనపడిందన్నారు. ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతోందని చెబుతూనే బీర్లు అమ్మాలి, భూములు అమ్మాలి, ఏఐ ద్వారా బూమ్ క్రియేట్ చేయాలి అప్పుడే ప్రభుత్వ ఖజానా నిండేలా ఉందని కనిపిస్తోందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరగకుండా ఉండడం, ఖజానా దివాళా తీయడం, భూమి అమ్మితేనే పైసలు వస్తాయని భావిస్తూ పాలనను నడిపేందుకు చూడటం ఆర్థిక సంక్షోభానికి నిదర్శమన్నారు. ఢిల్లీ దోస్తీ.. చెన్నై చెలిమి.. నామ్ కే వాస్తే.. గల్లీలో కుస్తీ గత 14 నెలల కాంగ్రెస్ పాలనలో ప్రతి అక్రమ, అవినీతి కేసుల్లో విచారణ సంఘాలు మూడడుగులు ముందుకు, ఆరడుగులు వెనక్కి నడుస్తున్నాయంటూ ఎద్దేవా చేశారు. ఢిల్లీ దోస్తీ, చెన్నై చెలిమి, నామ్ కే వాస్తే గల్లీలో కుస్తీ. ఇదే బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య వ్యవహారం నడుస్తుందన్నారు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయులు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో, త్వరలో జరగబోయే హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ అదే పరిస్థితి కనిపిస్తోందని తెలిపారు. ఈనెల 23న జరిగే హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లుగా ఉన్న కార్పొరేటర్లు తమ అంతరాత్మ ప్రకారం ఓటు వేయాలని కోరారు. ఎంఐఎంను మట్టుబెట్టాలన్నా, ఓడించాలంటే ఇదే అసలైన సమయమంటూ పిలుపునిచ్చారు.

దద్దమ్మల్లా చంద్రబాబు బూట్లు నాకుతున్నారు: మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: కృష్ణా జలాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ చేతకాని తనం మరోసారి బయటపడిందని మాజీమంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇంతకాలం బీఆర్ఎస్ చేస్తున్న వాదనను కేఆర్ఎంబీ రుజువు చేసిందని తెలిపారు. కృష్ణా జలాల్లో 74 శాతం నీళ్లను ఏపీ ప్రభుత్వం వాడుకుందని కేఆర్ఎంబీ ధ్రువీకరించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 24 శాతం నీళ్లను కూడా వాడుకోలేక పోయిందని చెప్పారు. బీఆర్ఎస్ హెచ్చరించిన తర్వాత కూడా ఏపీ 65 టీఎంసీల కృష్ణా జలాలను వాడుకుందని తెలిపారు. ఏపీ జల దోపిడీపై సీఎం, మంత్రులు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. చేతకాని దద్దమ్మల్లా చంద్రబాబు బూట్లు నాకుతున్నారని ఆరోపించారు. కృష్ణా పరివాహక ప్రాంత జిల్లాల మంత్రులు సైతం నోరు ఎందుకు మెదపడం లేదని అన్నారు. కమీషన్లు దండుకోవడానికి సీఎం, మంత్రులు ప్రాధాన్యమిస్తున్నారని ఆరోపించారు. ఢిల్లీకి మూటలు పంపడంలో ఉన్న శ్రద్ధ రైతులపై లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాగునీటికి కూడా కటకట ఏర్పడే పరిస్థితి ఉన్నా సమీక్షలు చేయడం లేదన్నారు. కేసీఆర్ హయంలో 38 శాతానికి పైగా కృష్ణా జలాలను వాడుకున్నామని తెలిపారు. తెలంగాణ హక్కులపై సోయి లేకుండా వ్యవహరిస్తే ఈ ప్రభుత్వాన్ని చరిత్ర క్షమించదని హెచ్చరించారు. మరో పోరాటానికి తెలంగాణ సిద్ధం కావాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన సీఎం, మంత్రులు ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

నేషనల్ హెరాల్డ్‌లో కోట్లు కొల్లగొట్టాలని కుట్రలు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: దేశ చరిత్రలో కాంగ్రెస్ ప్రభుత్వం బోఫోర్స్, టూజీ, బొగ్గు కుంభకోణం వంటి ఎన్నో అవినీతి, అక్రమాలకు పాల్పడిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. ప్రస్తుతం నేషనల్ హెరాల్డ్ కేసులోనూ వేలకోట్లు కొల్లగొట్టాలని చూస్తోందని, స్వాతంత్ర్య సమరయోధులు నేషనల్ హెరాల్డ్ ను స్థాపించుకుంటే దొడ్డిదారిన ఈ పత్రిక ద్వారా రాహుల్, సోనియా గాంధీకి సంబంధించిన రియల్ ఎస్టేట్ కంపెనీకి ఈ ఆస్తులను బదలాయించుకుంటున్నారని ఆరోపించారు. బుధవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. దీనిపై విచారణ చేస్తే కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా ధర్నాలు చేపట్టడం సిగ్గుమాలిన చర్య. ఆపార్టీకి చట్టంమీద విశ్వాసం ఉంటే ధర్నాలు చేయరని పేర్కొన్నారు.నెహ్రూ కుటుంబానికి, దేశాన్ని లూటీ చేయాలనే ఉద్దేశమే తప్ప సేవ చేయాలనే ఉద్దేశం లేదని, బోఫోర్స్ కుంభకోణం నుంచి నేషనల్ హెరాల్డ్ కేసు వరకు కాంగ్రెస్ పార్టీ సర్వస్వం అవినీతిమయం అంటూ విరుచుకు పడ్డారు. ఈ పత్రికకు రూ. 90 కోట్ల రుణం ఇస్తే దాంట్లో రూ. 50 లక్షల కోసం మళ్లీ రియల్ ఎస్టేట్ కంపెనీకి దారి మళ్లించారని పేర్కొన్నారు. మోడీ ప్రధాని అయ్యాకే ఈ కేసులు బయటకు వచ్చినట్లు సోనియా, రాహుల్, కాంగ్రెస్ నేతలను సుద్దపూసలు అయినట్లు మాట్లాడుతున్నారు. ఆ పార్టీ ఉల్టాచోర్ అన్నట్లుగా వ్యవహరిస్తోందని,ఎందుకు ధర్నాలు చేస్తోందో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఈడీ కార్యాలయాలు, కేంద్రప్రభుత్వ కార్యాలయాల ముందు ధర్నాలు చేసినంత మాత్రాన వారి అవినీతి, అక్రమాలు సమసిపోవు అనే విషయాన్ని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు.కంచ గచ్చిబౌలి విషయంలో ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం చేసిన దుందుడుకు చర్యలను, తప్పును ఒప్పుకుని కోర్టుముందు వితండవాదాలు చేయవద్దన్నారు. అబద్ధాలు మాట్లాడకుండా ఆ భూమిలో సుప్రీంకోర్టు చెప్పినట్లు అక్కడ మొక్కలను నాటే పని చేపడితే బాగుంటుందన్నారు. అర్ధరాత్రి ఫ్లడ్ లైట్లు పెట్టి చెట్లను నరికిన ఘటనలు దేశ చరిత్రలో ఎక్కడా లేవని, పోలీసు బందోబస్తు పెట్టి వంద ఎకరాల్లో చెట్లు నరకడం పూర్తిగా కాంగ్రెస్ పార్టీ దుర్మార్గానికి అద్దం పడుతోంది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా భూములను అమ్ముకునేందుకు ప్రయత్నించింది. జింకలు చనిపోయిన మాట వాస్తవం కాదా పర్యావరణాన్ని, ప్రకృతిని కాపాడాల్సిన బాధ్యత సమాజానికి ఉందన్నారు.

వక్ఫ్ చట్టంలో లొసుగులు: బీజేపీ నేత మనోహర్‌రెడ్డి

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: గత వక్ఫ్ చట్టంలోని లొసుగులను తొలగిస్తూ, మెరుగైన చట్టంను తీసుకురావడమే ఈ సవరణల ఉద్దేశమని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగిడి మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం బిజెపి రాష్ట్ర కార్యాయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ వక్ఫ్ సవరణ చట్టం రూపుదిద్దుకోవడానికి చాలా మంది ముస్లింలు, మతపరమైన సంస్థలు, సంఘాల అభిప్రాయాలు తీసుకున్న తరువాతే ఈనెల 5న రాష్ట్రపతి సంతకంతో చట్టంగా మారిందన్నారు. ముస్లింల వెనుకబాటుతనానికి కాంగ్రెస్ పార్టీ కారణమై వక్ఫ్ సవరణ బిల్లుకు అడ్డు తగిలిందన్నారు.1995, 2013లో వక్ఫ్ చట్టంలో తీసుకువచ్చిన సవరణలతో అపరిమిత అధికారాలు వక్ఫ్ బోర్డుకు లభించాయి. ఇది ముస్లింలకు కాక, కొంతమంది రాజకీయ నాయకులకు, మత పెద్దలకు లాభం కలిగించిందని విమర్శించారు. 2014 ఎన్నికల్లో ముస్లింల ఓటు బ్యాంకును ఆకర్షించేందుకు కాంగ్రెస్ పార్టీ చట్టాన్ని వక్రీకరించి ఉపయోగించుకుని వక్ఫ్ బోర్డు ద్వారా సమాజాన్ని మతపరంగా రెచ్చగొట్టే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. మోడీ ప్రభుత్వం వక్ఫ్ చట్టంలో మార్పులు తీసుకువచ్చి, జవాబుదారీతనంగా ఉండేలా, పారదర్శకంగా ఆస్తుల నిర్వహణ జరిగేలా చట్టాన్ని తీసుకువచ్చింది. కాంగ్రెస్ దీనిని మతపరమైన అంశంగా మలచి ముస్లింలను రెచ్చగొట్టే ప్రయత్నం చేయడం బాధాకరమన్నారు. ఈ చట్టం ఏ మతానికి వ్యతిరేకం కాదని ప్రజా ప్రయోజనాలను కాపాడే, వక్ఫ్ ఆస్తుల నిర్వహణలో సమర్థతను తీసుకువచ్చే చట్టమని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులను చేర్చడం వంటివాటిని వక్రీకరిస్తూ, మసీదులు, మదర్సాలు, ఖబరస్థానాలు ఆక్రమించబడతాయని తప్పుడు ప్రచారం చేస్తోంది. ఇది పూర్తిగా నిరాధారమైనదే కాకుండా, ముస్లింలను భయభ్రాంతులకు గురిచేసే రాజకీయం అన్నారు. పశ్చిమబెంగాల్‌లో ఇలాగే అల్లర్లు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. కొంతమంది రాజకీయ నాయకులు వక్ఫ్ భూముల ద్వారా ఆస్తులను కొల్లగొట్టి సామాన్య ముస్లింలకు కనీస అవసరాలు కూడా దక్కకుండా చేస్తున్నారు. ప్రస్తుత చట్టం వక్ఫ్ బోర్డుల ఈ ఏకపక్ష అధికారాలను పూర్తిగా తొలగించింది. వక్ఫ్ బోర్డులపై ప్రభుత్వ ఆస్తులను స్వాధీనం చేసుకోకుండా ఉండేందుకు, కలెక్టర్లు, ఉన్నతస్థాయి అధికారులను నియమించాలని చట్టం ప్రకారం నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. వక్ఫ్ సవరణ చట్టంపై వచ్చిన అపోహలను తొలగించడానికి, ఈనెల 20వ తేదీ నుంచి మే 5వ తేదీ వరకు,

సాఫ్ట్‌గా ఉందని తక్కువ అంచనా వేయకండి... ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఫైర్!

విశ్వంభర, పాలకుర్తి: పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. చిన్న అమ్మాయి, సాఫ్ట్ గా ఉంది అనుకొని నన్ను తక్కువంచనా వేయవద్దని హెచ్చరించారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. తాను ప్రతిదీ గమనిస్తూనే ఉన్నానని, సమయం వచ్చినప్పుడు ఎలా రియాక్ట్ అవ్వాలో అలా రియాక్ట్ అవుతానని అన్నారు. తాము ఏం అనట్లేదని మాటిమాటికి అత్తాకోడళ్లు అనుకుంటూ ఏదేదో మాట్లాడుతున్నారా ? అంటూ మండిపడ్డారు. మిమ్మల్ని శివార్ల దాకా ఉరికించే బాధ్యత మాదే అంటూ వ్యాఖ్యానించారు. ఇప్పటికే పాలకుర్తిలో కాంగ్రెస్ సత్తా ఏంటో చూపించామని వచ్చే లోకల్ బాడీ ఎన్నికల్లో ఎవరి దమ్ము ఏంటో చూసుకుందామని సవాల్ విసిరారు.తెలంగాణలో మళ్లీ వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. పాలకుర్తి నియోజకవర్గం అభివృద్ధి విషయంలో తనకు విజన్ ఉందని అన్నారు. ఎవరు ఎన్ని విమర్శలు చేసినా అనుకున్న సమయంలో పనులు జరుగుతాయని చెప్పారు. మరోసారి అత్తాకోడళ్లు అని ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే మర్యాదగా ఉండదని హెచ్చరించారు. మాజీ మంత్రి దయాకర్ రావు వయసుతో పాటూ హుందాతనాన్ని కాపాడుకోవాలని హితవుపలికారు. ఏడాది పాలనకే ఇంత ఫ్రస్టేషన్ వస్తే కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తే ఏం అయితారో, ఆరోగ్యాలు చూసుకోవాలంటూ షాకింగ్ కామెంట్స్ చేశారు. ఇదిలా ఉంటే ఎర్రబెల్లి దయాకర్ నిన్న ఓ సమావేశంలో మాట్లాడుతూ యశస్విని రెడ్డిపై, కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు కురింపించిన సంగతి తెలిసిందే.

దేశంలో ఉన్న ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ఈ వేధింపులు ఖండిస్తున్నారు : మంత్రి పొన్నం

విశ్వంభర,హుస్నాబాద్ : దేశం కోసం ప్రాణాలర్పించిన నెహ్రూ కుటుంబంపై బీజేపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడి ఈడీ పేరుతో వేధిస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. బుధవారం హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ లపై ఈడి ఛార్జ్ షీట్లకు నిరసనగా బీజేపీ కి వ్యతిరేకంగా భారీ ధర్నా చేపట్టారు. ఈ ధర్నాలో నియోజకవర్గంలోని ఏడు మండలాల కాంగ్రెస్ కార్యకర్తలు, ముఖ్య నేతలు, అనుబంధ సంఘాల నేతలు, యూత్ కాంగ్రెస్, ఎన్ ఎస్ యు ఐ, మహిళా కాంగ్రెస్ నేతలు పాల్గొన్న ఈ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్వయంగా రోడ్డుపై కూర్చుని నిరసన తెలిపారు. మోడీ కుట్రపూరిత వైఖరి నశించాలని నినాదాలు చేశారు.ఒకవైపు కాంగ్రెస్ పార్టీ ప్రజల కోసం పోరాడుతూ ఉంటే ఎదుగుదల చూసి ఓర్వలేకనే ఈడీ కేసుల పేరుతో ఛార్జ్ షీట్ ల పేరుతో ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు.దేశంలో గాంధీ కుటుంబమే ఆస్తులను సంపాదించాలని అనుకుంటే ముఖ్యమంత్రులను, కేంద్ర మంత్రులను చేసింది వాళ్లు అవినీతికి పాల్పడకపోయేదా అని అన్నారు. 85 సంవత్సరాలు ఉన్న సోనియా గాంధీని కూడా విచారణ పేరుతో ఇబ్బంది పెడుతూ రాక్షసత్వంతో వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు

సన్న బియ్యం పథకంతో బీఆర్ఎస్ పార్టీకి నూకలు చెల్లాయి : మధుయాష్కి గౌడ్

విశ్వంభర, హైదరాబాద్ : సన్న బియ్యం పథకం తో బీఆర్ఎస్ పార్టీకి నూకలు చెల్లాయని, అందుకే ఆ పార్టీ నాయకుడు హరీష్ రావు పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నాడని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ గారు ఆరోపించారు. హయత్ నగర్ పాత గ్రామంలోనీ రేషన్ షాపును మధుయాష్కీ బుధవారం సాయంత్రం సందర్శించారు.ఈ సందర్భంగా సన్న బియ్యం అందుతున్న తీరును లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. వారంతా కూడా సన్న బియ్యాన్ని ప్రభుత్వ అందిస్తుండడంపై తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం సన్నబియ్యం అందిస్తుంటే ఓర్వలేక నూకలు వస్తున్నాయంటూ అబద్ధాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. టిఆర్ఎస్ పార్టీకి నూకలు చెల్లాయని బీఆర్ఎస్ పార్టీగా పేరు మార్చుకున్నారని, ఇప్పుడు బీఆర్ఎస్ పార్టీకి కూడా నూకలు చెల్లాయని ఎద్దేవా చేశారు.పేదలకు సన్న బియ్యం అందజేయడం నా కల అని సీఎం రేవంత్ రెడ్డి అందిస్తుంటే ఓర్వలేక ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఎన్ని వందల కోట్లు అయినా సరే సన్న బియ్యం అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు.మిస్టర్ హరీష్ రావు...! సన్న బియ్యం పథకంతో నీ పార్టీకి నూకలు చెల్లుతున్నాయని అడ్డగోలుగా అబద్ధాలు చెబుతున్నావని విమర్శించారు. ప్లాస్టిక్ బియ్యం నూకలు అంటూ అబద్ధాలు మాట్లాడుతున్నాడని విమర్శించారు. ఎక్కడైనా నూకలు కనపడుతున్నాయా..? వచ్చి చూడాలని సూచించారు. సన్నగా ఉన్నావ్ కదా హరీష్ రావు.. ప్రేమిస్తున్న సన్న బియ్యం మంచిగా తిను .. అని సూచించారు.ప్రతిపక్ష పార్టీలో ఉన్నప్పటికీ ప్రభుత్వం మంచి పని చేసినప్పుడు సమర్థించాలని సూచించారు.సన్న బియ్యం పథకంతో నిరుపేదలు ఎంతో సంతోషంగా ఉన్నారు పేదలు సంతోషంగా ఉండాలన్నదే రాహుల్, గాంధీ సోనియా గాంధీ కోరుకుంటున్నారని, ఎన్ని కోట్లు ఖర్చు అయిన సన్న బియ్యం పథకం ద్వారా ప్రతి పేదవాడికి సన్న బియ్యం అందిస్తామని మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి చెబుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్ రెడ్డి , జిల్లా మహిళా కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు కళ్లెం సుజాత రెడ్డి , హయత్ నగర్ డివిజన్ అధ్యక్షులు చెన్నగోని రవీందర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

మంత్రివర్గ విస్తరణలో లంబాడీలకు స్థానం అవకాశం కల్పించాలి

విశ్వంభర, హైదరాబాద్: రాష్ట్రంలో 60 లక్షల మంది లంబాడీలకు మంత్రి వర్గంలో స్థానం లేకపోవడం విచారకరమని నంగారా భేరి లంబాడి హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు గణేష్ నాయక్ అన్నారు. త్వరలో జరుగనున్న మంత్రివర్గ విస్తరణలో అర్హులైన వారికి గిరిజన శాఖ మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. బుధవారం నంగారా భేరి లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యవర్గ సమాశంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా గణేష్ నాయక్ హాజరై మాట్లాడుతూ. . సంఘం రాష్ట్ర కార్యవర్గాన్ని రద్దు చేసి కొత్త కమిటీని ఎన్నుకోనున్నట్లు చెప్పారు. లంబాడీలకు ఇష్ట ఆరాధ్యుడైన సేవాలాల్ మహారాజ్ జయంతిని ప్రభుత్వ సెలవు రోజుగా ప్రకటించాలని కోరారు. గిరిజన విద్యార్థుల ఫీజు రియంబర్సుమెంటు విడుదల చేయాలని కోరారు. గి